సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేల ధర పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.6°/ 14.2°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

లేపాక్షి శిల్పకళ అద్భుతం



బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న దృశ్యం



ఆలయ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న అర్చకుడు



సీతమ్మ పాదాన్ని ఫొటో తీసుకుంటున్న ప్రతినిధులు

హిందూపురం: లేపాక్షి శిల్పకళా సౌందర్యం అద్భుతమని, నాటి చరిత్ర కళ్లకు కట్టినట్లు ఉందని జీ-20 ప్రతినిధులు కొనియాడారు. బెంగళూరులో జరిగిన జీ-20 సమ్మిట్‌కు హాజరైన విదేశీ ప్రతినిధులు 29 మందితో పాటు వారి సహాయకులు మంగళవారం ఉదయం కర్ణాటకలోని పావగడ సమీపంలో గల మెగా సోలార్‌పవర్ ప్లాంటును పరిశీలించారు. సాయంత్రం లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద వారికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్కియాలజీ అధికారులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ తిలకం దిద్ది పూలమాలతో సత్కరించి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వీరభద్ర స్వామి ఆలయ రాతి నిర్మాణం, శిల్పకళా సంపద, ఆలయ ప్రాశస్త్యం గురించి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు జీ-20 బృందానికి వివరించారు. విజయనగర సామ్రాజ్యంలో ఆలయాలకు ఇచ్చిన ప్రాధాన్యతను వివరిస్తూ.. కట్టడాలు, సభామండపం, కుడ్య వర్ణ చిత్రాలు, వాస్తు, నిర్మాణశైలులను తెలియజేశారు. విజయనగర కాలంలో వ్యాపార, వాణిజ్యంతో పాటు ఆధ్యాత్మికం, శిల్ప కళలకు ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు.

వేలాడే స్తంభాన్ని చూసి ఆశ్చర్యపోయిన ప్రతినిధులు..

ఆలయంలో ఉన్న వేలాడే స్తంభాన్ని చూసి జీ-20 ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. క్షుణ్ణంగా పరిశీలించి సెల్‌ఫోన్లలో బంధించారు. ఏకశిలా గణేశుడు, నాగలింగం విశిష్టత, శిల్పకళా సంపద, చరిత్ర గురించి తెలుసుకున్నారు. పెద్ద రాతిపై రాసిన తెలుగు,కన్నడ అక్షరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం లేపాక్షి ఆలయం నుంచి బయలుదేరుతూ మార్గంలో బస్సులో నుంచే అతి పెద్ద ఏక శిలా నంది విగ్రహాన్ని చూసి సంబరపడ్డారు. పక్కనే కొండపై జటాయువు పక్షి విగ్రహాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేపాక్షి సందర్శన తమ జీవితంలో మరువలేనిదన్నారు. జీ-20 ప్రతినిధి బృందం పర్యటన సందర్భంగా లేపాక్షి ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. డీఐజీ రవిప్రకాష్ నేతృత్వంలో శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల ఎస్పీలు రాహుల్ దేవ్ సింగ్, ఫక్కీరప్ప పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.



లేపాక్షి ఆలయం ఎదుట జిల్లా అధికారులతో జీ-20 ప్రతినిధుల బృందం



వేలాడే స్తంభం చూస్తూ...



ఆలయంలోని శిల్పకళ గురించి తెలుసుకుంటున్న జీ-20 ప్రతినిధులు

న్యూస్‌రీల్

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెంచాలి

- డీఐజీ రవి ప్రకాష్



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ రవిప్రకాష్

పెనుకొండ రూరల్: ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా మరింత పెంచాలని, శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దని డీఐజీ రవి ప్రకాష్ ఆదేశించారు. మంగళవారం ఆయన 'కియా' పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు తదితర అంశాలపై ఆరా తీశారు. 'కియా' పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువగా పరిశ్రమలు ఉన్నందున ఉద్యోగుల భద్రతా, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్ఐ వెంకటరమణకు సూచించారు. అలాగే సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

అందుబాటులోకి ఇంద్ర బస్సు

- నేడు హిందూపురం-బీహెచ్‌ఈఎల్ సర్వీసు ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇంద్ర బస్సు

పుట్టపర్తి టౌన్: దూరప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా నుంచి నాలుగు ఇంద్ర బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిందూపురం, కదిరి నుంచి నాలుగు ఇంద్ర సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. 8వ తేది (బుధవారం) సాయంత్రం హిందూపురంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల హిందూపురం-బీహెచ్‌ఈఎల్ ఇంద్ర సర్వీసును ప్రారంభిస్తామన్నారు. ఈ బస్సు రోజూ రాత్రి 9 గంటకు హిందూపురం నుంచి బయలు దేరుతుందన్నారు. అలాగే రోజూ రాత్రి 9 బీహెచ్‌ఈఎల్ మరో ఇంద్ర బస్సు బయలుదేరి ఉదయం 7 గంటలకు హిందూపురం చేరుకొంటుందన్నారు. అదేవిధంగా ఈనెల 2వ వారంలో కదిరి నుంచి హైదరాబాదుకు మరో ఇంద్ర సర్వీసు నడుపుతామన్నారు. ప్రయాణికులకు అడ్వాన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

టీడీపీ నేత పొలంలో గంజాయి సాగు

- అనుచరుడిపై కేసు



గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు.. చిత్రంలో నిందితుడు రామకృష్ణ (బ్లాక్ టీషర్ట్ ధరించిన వ్యక్తి)

గాండ్లపెంట: మండలంలోని గుండేవాండ్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వీరంనాయుడు పొలంలో గంజాయి సాగు చేశారు. ఈ విషయం పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసింది. అయితే..వీరంనాయుడు అనుచరుడు రామకృష్ణపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారు. కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని గంగమ్మమోరులో ఉన్న సర్వేనంబరు 245లోని వీరంనాయుడు పొలంలో గంజాయి మొక్కలను మంగళవారం పోలీసులు గుర్తించారు. ఎవరు సాగు చేస్తున్నారని ఆరా తీయగా మాజీ ఎంపీటీసీ వీరంనాయుడు పొలంలో అనుచరుడు రామకృష్ణ సాగు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అక్కడ ఉన్న రామకృష్ణ తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. సీఐతో పాటు మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రియ, వీఆర్వో జయరాం పొలాన్ని పరిశీలించారు. వారి సమక్షంలో గంజాయి మొక్కలను తొలగించారు. మాదకద్రవ్య నిరోధక చట్టం కింద రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరంనాయుడు తన రెండెకరాల పొలంలో వేరుశనగ సాగు చేస్తున్నాడని, పొలం సరిహద్దు పంటగా చుట్టూ మేర సాళ్లల్లో జొన్న గడ్డిని పెంచి అందులో అక్కడక్కడ గంజాయి మొక్కలు పెంచాడని తెలిపారు. పొలం యజమాని అందుబాటులో లేడన్నారు.

వంచనకు పరిచయం

- సామాజిక మాధ్యమాలే వేదిక
- ముక్కూమొహం తెలీని వారితో స్నేహం
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాలతో చాటింగ్
- మాయమాటలతో ముగ్గులోకి దించుతున్న అబ్బాయిలు
- ఒక్క ఏడాదిలోనే మోసపోయిన 71 మంది అమ్మాయిలు

- అనంతపురంలోని పాతూరుకు చెందిన స్వాతి (పేరు మార్చాం) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బెంగళూరుకు చెందిన అబ్బాయి వలలో పడింది. ఉన్నఫళంగా ఒకరోజు ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు 'దిశ' పోలీస్‌స్టేషన్ ఆశ్రయించారు. చివరకు పోలీసుల జోక్యంతో అమ్మాయిని వెతికి ఇంటికి తెచ్చారు.
- ధర్మవరం పట్టణానికి చెందిన అమ్మాయి కావ్య (పేరు మార్చాం) అనంతపురంలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. ఒకరోజు ఉన్నఫళంగా అబ్బాయితో వెళ్లిపోయింది. ఇరవై రోజుల తర్వాత ఫోన్ కాల్స్ ఆధారంగా కనుక్కుని అమ్మాయిని తీసుకొచ్చారు. కారణమేమీ అంటే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన అబ్బాయితో వెళ్లిపోయినట్టు తేలింది.

వీరిద్దరే కాదు ఎంతోమంది స్మార్ట్‌ఫోన్లలో సామాజిక మాధ్యమాల ద్వారా ముక్కూమొహం తెలీని వ్యక్తులు విసిరిన వలలో చిక్కుకుని మోసపోతున్నారు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు వినియోగిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. స్మార్ట్ ఫోన్ ఉందంటే చాలు కచ్చితంగా తమ పేరుపై ఖాతాలు తెరిచేస్తున్నారు. ప్రతిదీ అందులో షేర్ చేసుకుంటున్నారు. అలాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కడెక్కడి వారో పరిచయమవుతున్నారు. అలా చాటింగ్‌తో స్నేహం పెంచుకుంటున్నారు. ప్రత్యక్షంగా వారిని చూడకపోయినా.. వారి గుణగణాలు, నేపథ్యం తెలియకపోయినా గుడ్డిగా నమ్ముతున్నారు. ఇటువంటి తరుణంలో అమ్మాయిలను కొందరు అబ్బాయిలు ట్రాప్‌లో పడేస్తున్నారు. క్రమక్రమంగా అమ్మాయిలు తమ కెరీర్‌ను పక్కన పెట్టి పోకిరీల చేతిలో మోసపోతున్నారు. తాజాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలాంటి మాధ్యమాల ద్వారా నష్టపోతున్న అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

కొంపముంచుతున్న ఇన్‌స్టాగ్రామ్

ఇటీవలి కాలంలో ఇంటర్ చదువుతున్న అమ్మాయిలకు తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ కొనిస్తున్నారు. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులంటూ పరిచయమైన ఈ ఫోన్‌లు ఇప్పుడు పర్సనల్ ఖాతాల వరకూ వెళ్లాయి.

అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు		
తరగతి	బాలురు	బాలికలు
ఫస్టియర్	9,960	9,193
సెకండియర్	12,147	11,211
మొత్తం	19,153	23,558
శ్రీసత్యసాయి జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు		
ఫస్టియర్	4,911	4,533
సెకండియర్	7,032	6,492
మొత్తం	9,444	13,524

ప్రతి అమ్మాయి.. అబ్బాయి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల ద్వారా చాటింగ్ చేస్తున్నారు. ఎవరితో మాట్లాడుతున్నాం, ఎందుకు మాట్లాడుతున్నామన్న కనీస అవగాహన కూడా లేకుండా అబ్బాయిలకు వ్యక్తిగత వివరాలు షేర్ చేస్తున్నట్టు వెల్లడైంది. దీన్ని కొందరు అబ్బాయిలు అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. అమ్మాయిలు నష్టపోయే వరకూ వాస్తవ విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అమ్మాయిలు నష్టపోయాక ఏకంగా తల్లిదండ్రులు వారితో చదువు మాన్పిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది వ్యవధిలో 71 మంది అమ్మాయిలు ఇలా సామాజిక మాధ్యమాల ద్వారా అబ్బాయిల వలలో పడినట్టు తేలింది.

బాధితుల్లో అమ్మాయిలే ఎక్కువ



సామాజిక మాధ్యమాల బాధితుల్లో ఎక్కువగా అమ్మాయిలే ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్ పరిచయాలు ఎక్కువయ్యాయి. నెలకు ఐదారు కేసులు వస్తున్నాయి. తల్లిదండ్రుల కోరిక మేరకు వివరాలు గోప్యంగా ఉంచి అబ్బాయిలను మందలించి పంపిస్తున్నాం. పరిచయం లేని వ్యక్తితో చాటింగ్ చేయొద్దు. వ్యక్తిగత, కుటుంబ వివరాలు షేర్ చేయద్దు.

–ఆళ్ల శ్రీనివాసులు, డీఎస్పీ, 'దిశ' పోలీస్ స్టేషన్

వ్యసనంగా మారింది



రకరకాల సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షితులు కావడమనేది 'ఎమోషనల్ డిపెండెన్సీ' అంటారు. ఆ గ్రూపులో తిరిగే వారిని బట్టి కూడా ఉంటుంది. ముందుగా దీనిపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. నాలుగు రోజుల కిందట 8వ తరగతి అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్ కోసం ఏడుస్తోందని తల్లిదండ్రులు నా దగ్గర కొచ్చారు. ఇలా అలవాటు చేయడం వల్ల వాళ్లు దానికి బానిసల్లా మారి నష్టపోతున్నారు.

–డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణుడు, అనంతపురం

పాడి రైతుల ముంగిటకే పశువైద్యం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సంచార పశువైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: పాడి రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచార పశువైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సంచార పశువైద్య వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... 108 తరహాలో పాడి పశువులకు కూడా పల్లెల్లో వైద్య సేవలు అందించేందుకు సంచార పశువైద్య వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఓడీ చెరువు కేంద్రంగా ఓడీ చెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల్లోని పాడి రైతులకు ఈ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. పాడిపశువులకు ఏదైనా ఆనారోగ్య సమస్య తలెత్తినా, అత్యవసర చికిత్సలు అవసరమైనా 1962 నంబర్‌కు కాల్ చేస్తే గ్రామానికే పశువైద్యులు వచ్చి పశువులకు చికిత్స చేస్తారన్నారు. అత్యవసరమైతే శస్త్రచికిత్సలు కూడా చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి సుబ్బరాజు, డీడీ పెంచలయ్య, ఏడీ శివప్రసాద్, పశువైద్యాధికారి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, మండల కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లకు నిప్పు!

- రాజకీయ వైరంతో కలికివాండ్లపల్లిలో దుశ్చర్య
- కాలిపోయిన 1000 జామచెట్లు
- టీడీపీ కార్యకర్తలపనేనని బాధిత రైతు ఆరోపణ



రవీంద్రారెడ్డి పొలంలో కాలిపోయిన జామచెట్లు

రామగిరి: రాజకీయ వైరంతో ఓ రైతుకు చెందిన 1,000 జామ చెట్లకు నిప్పుపెట్టారు. స్వార్థ రాజకీయానికి పచ్చని చెట్లను బుగ్గి చేశారు. వివరాల్లోకి వెళితే...రామగిరి మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి రవీంద్రారెడ్డి జామతోట సాగు చేస్తున్నాడు. దాదాపు 3 వేల చెట్లు తోటలో ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రవీంద్రారెడ్డి పొలానికి వెళ్లి చూడగా...1,000పైగా జామ చెట్లు పూర్తిగా కాలిపోయి కనిపించాయి. దీంతో రూ.3 లక్షల వరకూ నష్టం వచ్చినట్లు బాధిత రైతు చెబుతున్నారు.

టీడీపీ నేతల పనే!

తన ఎదుగుదల ఓర్వలేక పరిటాల కుటుంబం ప్రోత్సాహంతో కొందరు టీడీపీ నాయకులే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధిత రైతు రవీంద్రారెడ్డి చెబుతున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇప్పటికే పలువురు రైతుల పంటలను పాడు చేశారని, ఇప్పుడు కూడా వారే నిప్పుపెట్టి ఉంటారని ఆయన చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా పంటలు వేయడం లేదని, ఇటీవలే ప్రకృతి కరుణించడం ...పాలకులూ చేయూత ఇవ్వడంతో రైతులంతా పంటలు సాగుచేస్తున్నారన్నారు. పచ్చని పైర్లను చూసి ఓర్వలేని 'పచ్చ' నేతలే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారన్నారు.

విద్యార్థి వివరాలన్నీ నమోదు కావాలి

- యూడైస్ ప్లస్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రత్యేక అధికారి వినయ్ మోహన్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వినయ్ మోహన్

ప్రశాంతి నిలయం/ కొత్తచెరువు: ప్రతి పిల్లాడి వివరాలు విద్యాశాఖ వద్ద పక్కాగా ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ యూడైస్ నమోదు ప్రత్యేకాధికారి వినయ్ మోహన్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలల్లోని ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 విద్యార్థుల వివరాలతో పాటు అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో, కేజీబీవీల్లో ఇంటర్ చదివే విద్యార్థుల వివరాలన్నీ 'యూడైస్ ప్లస్'లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన వినయ్ మోహన్... యూడైస్ ప్లస్ నమోదు పరిశీలనలో భాగంగా పలు పాఠశాలలను సందర్శించారు. అనంతరం కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగిన మండల విద్యాధికారుల సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. అందువల్ల బడిఈడు పిల్లలందరూ తప్పని సరిగా బడిలోనే ఉండాలన్నారు. ప్రీ ప్రైమరీ-1, ప్రీప్రైమరీ -2 తోపాటు ఇంటర్ వరకు ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో కానీ, ప్రైవేట్ సంస్థల్లో కానీ తప్పని సరిగా చదువుకునేలా చూడలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం తాజాగా యూడైస్ ప్లస్ నమోదులో మార్పులు తీసుకువచ్చిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ-1 ,2లలో చదువుతున్న విద్యార్థుల వివరాలు వీలైనంత త్వరగా నమోదు చేసుకునేలా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ప్రోత్సహించాలన్నారు. నమోదు పక్కాగా అమలైతేనే డ్రాపౌట్స్‌ను పూర్తిగా నిరోధించి అందరికీ విద్య లక్ష్యాలను చేరుకోగలమన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా చూడాలి..

ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాలన్నీ పక్కాగా అమలయ్యేలా మండల విద్యాధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత ట్యాబ్‌లలో బైజ్యూస్ కంటెంట్‌ను కనీసం గంట పాటు అభ్యసించేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణ జరుగుతోందా అన్న విషయాన్ని పర్యవేక్షించాలన్నారు. ఉపాధ్యాయులు సైతం ట్యాబ్‌ల వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. 'నాడు-నేడు' పనుల నిర్వహణ, జగనన్న విద్యాకానుక, విద్యార్థుల యూనిఫాం తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డిప్యూటీ డీఈఓ రంగస్వామి, ఏడీలు రామకృష్ణ, నాగరాజు, జిల్లాలోని అన్ని మండలాల విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా ఈ-క్రాప్ నమోదు



కొత్తచెరువు: కేశాపురంలో పంటలు పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్

కొత్తచెరువు/గోరంట్ల : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను పక్కాగా ఈ-క్రాప్ చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కొత్తచెరువు మండలంలోని కొత్తపల్లి, మీర్జాపురం, కె.లోచర్ల, గోరంట్ల మండలం జక్కసముద్రం, పులేరు, బూదిలి గ్రామాల్లో పర్యటించారు. జాయింట్ అజమాయిషి కింద అధికారులను చేసిన ఈ-క్రాప్ నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-క్రాప్‌లో నమోదైన పంటలే సాగులో ఉన్నాయా..? లేదా అని పరిశీలించారు. తొలుత కొత్తచెరువు మండలం కొత్తపల్లి గ్రామంలో చంద్రమోహన్ రెడ్డి అనే రైతు పొలంలో మిరప, బెండ పంటలను, తలమర్ల రెవెన్యూ పరిధిలోని మీర్జాపురం గ్రామంలో రైతు భూమన్నగారి వెంకటరెడ్డి పొలంలో వేరుశనగ పంటను పరిశీలించారు. అధికారులు ఈ-క్రాప్‌లో నమోదు చేసిన వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గోరంట్ల మండలం జక్కసముద్రంలో ఇందిరమ్మ అనే రైతుకు సాగు చేసిన వేరుశనగ పంటను, పులేరు గ్రామంలో చంద్రశేఖరరెడ్డి పొలాన్ని, బూదిలి గ్రామంలో ఆదెప్పకు చెందిన వేరుశనగ పంటలను పరిశీలించారు. పంట వివరాలు, విస్తీర్ణం, రైతు పేరు ఈ-క్రాప్‌లో సరిగా నమోదై ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ-క్రాప్‌లో వివరాలు తప్పులుంటే రైతులకు తీరని నష్టం జరుగుతుందని, అందువల్లే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, ఎంపీడీఓ సిద్దారెడ్డి, ఏడీఏ స్వయం ప్రభ, ఏఓ నటరాజ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అదే విధంగా బైరాపురం, లోచర్ల, కొత్తచెరువు, కొడపగానిపల్లి పంటపొలాలను జాయింట్ కలెక్టర్ టి.ఎస్.చేతన్ పరిశీలించారు.

క్లుప్తంగా

ఆర్బీకేల్లోనే రాగుల కొనుగోలు



మాట్లాడుతున్న పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ నాయక్

గుడిబండ: రైతు భరోసా కేంద్రాల వేదికగానే రాగుల కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని రైతులకు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ సూచించారు. ఆర్బీకేల్లో రాగి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశంపై మంగళవారం గుడిబండ రైతు భరోసా కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన అశ్వత్థనారాయణ మాట్లాడుతూ.. రబీలో రాగి సాగు చేసి, ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే క్వింటా రూ.3,575 చొప్పున ప్రభుత్వ మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మడకశిర వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్, గుడిబండ తహసీల్దార్ నాగభూషణం, ఏఓ తిమ్మప్ప, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ బాలికల విభాగం పోటీలకు జిల్లాకు చెందిన దీప్తి సాయి, బాలుర విభాగంలో సంజయ్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి ఎంపికయ్యారు. అలాగే అండర్–14 సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు రాజేశ్వరి, వసంత, కావ్య, దీక్షిత, మహాలక్ష్మి, బాలుర విభాగంలో శశి ఎంపికయ్యారు. వీరిని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, మొరార్జీ యాదవ్, శంకరన్న, రమేష్ అభినందించారు.

ఎస్‌పీఎల్ విజేత 'ఆర్ట్స్ కళాశాల'

- జూనియర్ విభాగంలో ఆత్మకూరు జట్టు
- విజేత జట్లకు ట్రోఫీల ప్రదానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లు మంగళవారం ఉత్కంఠగా సాగాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సీనియర్ విభాగంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, జూనియర్ విభాగంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. టోర్నీ విజేతలుగా నిలిచిన ఈ రెండు జట్లు త్వరలో జరిగే ఎస్‌పీఎల్ రీజనల్ స్థాయి టోర్నీలో పాల్గొననున్నాయి.

సిక్సర్లతో బెంబేలెత్తించిన అంగేష్..

జూనియర్ విభాగం ఫైనల్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సాయి విజ్ఞాన్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. జట్టులో శివమణి 30 బంతుల్లో 6 ఫోర్లతో 44 పరుగులు చేశాడు. ఆత్మకూరు బౌలర్లలో రాజేష్ 2 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో అంగేష్ 28 బంతుల్లో 6 సిక్సర్లతో 36 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకంగా మారాడు.

కట్టడి చేసిన ఆర్ట్స్ కళాశాల బౌలర్లు..

సీనియర్ విభాగంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతలక్ష్మి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ భీమ 27 బంతుల్లో 5 ఫోర్లతో 41 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు లక్ష్య ఛేదనలో పూర్తిగా తడబడింది. ఓపెనర్ ప్రశాంత్ తొలి రెండు బంతుల్లో ఫోర్, సిక్సర్ బాదాడు. ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాల బౌలర్ల ధాటికి తలొగ్గక తప్పలేదు. నిర్ణీత 10 ఓవర్లలో అనంతలక్ష్మి జట్టు 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు మాత్రమే చేసింది. 64 పరుగుల తేడాతో ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది.

యువతకు క్రీడలే స్ఫూర్తి..

యువతకు క్రీడలే స్ఫూర్తిగా నిలుస్తాయని జేఎన్‌టీయూ (ఏ) రిజిస్ట్రార్ సి.శశిధర్ అన్నారు. ఎస్‌పీఎల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలను ప్రదానం చేసి, మాట్లాడారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు యువతకు పోరాడే తత్వాన్ని క్రీడలే నేర్పిస్తాయన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ తరహా క్రీడలు నిర్వహించడం చాలా శ్రమతో కూడుకున్న పని అని, అయితే యువతను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ సాక్షి మీడియా యాజమాన్యం ఇలాంటి టోర్నీలను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాక్షి అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ విభాగంలో విజేత ట్రోఫీని అందుకుంటున్న ఆర్ట్స్ కళాశాల జట్టు



రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న అనంతలక్ష్మి జట్టు

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE



జూనియర్ విభాగంలో ఆత్మకూరు జూనియర్ కళాశాల జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్



రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల జట్టు

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



సుభాష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన జక్కా సతీష్, పార్వతి దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలసి హ్యాండ్ లూమ్ లిఫ్టింగ్ యంత్రాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి రెండో కుమారుడు సుభాష్ (22) పనిపై లక్ష్మీ చెన్నకేశవపురానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుభాష్‌ను తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని కార్పొరేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు... అడ్మిట్ చేసుకోకుండానే వెనక్కు తీసుకెళ్లాలని సూచించారు. సోమవారం తెల్లవారుజామున సుభాష్‌ను ధర్మవరానికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ: మండలంలోని దామానుపల్లికి చెందిన కె.ఓబుళరెడ్డి (46) కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తన అత్తగారి ఊరైన బుక్కపట్నం మండలం గశికవారిపల్లిలో ఊరు బయట పొలాల్లో సోమవారం ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, అనంతపురం ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న కుమారుడు జయచంద్రారెడ్డి ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.44.59 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 44.59 లక్షల ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 59 రోజులకు గానూ రూ.44,59,886 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.59,084 నగదు సమకూరింది. దీంతో పాటు 0.001 గ్రాముల బంగారు, 1.490 కిలోల వెండిని కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ సుగుణమ్మ, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కేబుల్ దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కొత్తచెరువు: మండలంలోని పాతదేవరపల్లికి చెందిన తిరుపాల్, ఆదినారాయణ పొలాల్లో ఉన్న కేబుల్, డ్రిప్ వైరు కట్టలు దొంగతనం చేసిన నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. పట్టుబడిన వారిలో పెనుకొండ మండలం మునిమడుగుకు చెందిన వినోద్‌కుమార్, రమేష్, గంగాద్రి, ఆవుల నరసింహులు, హరి ఉన్నారన్నారు. వీరు మంగళవారం కొత్తచెరువు మండలం మరకుంటపల్లి హంద్రీనీవా కాలువ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసిందన్నారు. నిందితుల నుంచి 190 మీటర్ల కేబుల్, 3 డ్రిప్ వైరు కట్టలు, చోరీ సమయంలో ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు పుట్లూరు నారాయణ

ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన చీరల వ్యాపారి పుట్లూరు నారాయణ(38) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... లక్ష్మీనగర్‌కు చెందిన పుట్లూరు నారాయణ చీరల వ్యాపారానికి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. అయితే సకాలంలో అప్పులు తీర్చలేక మదనపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మొదట గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండడంతో గమనించిన భార్య రాజేశ్వరి మృతుడిని తన భర్త నారాయణగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చూడి ఆవు ప్రాణాలు కాపాడిన వైద్యులు



ఆవుకు వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారులు

కూడేరు: అర్ధరాత్రి ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ ఆవుకు సకాలంలో చికిత్స అందజేసి ప్రాణాలు కాపాడారు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహన వైద్యులు. వివరాలు... కూడేరు మండలం ముద్దలాపురంలో రైతు ఆదినారాయణ పెంచుతున్న ఆవు ఇటీవల చూడి కట్టింది. సోమవారం సాయంత్రం ప్రసవ సమయంలో ఆవు ఇబ్బంది పడుతుండడంతో గమనించిన రైతు వెంటనే సంచార పశుఆరోగ్య సేవ వాహన టోల్‌ఫ్రీ 1962కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న వెంటనే సంచార పశు ఆరోగ్య వాహన వైద్యులు ఆ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. గర్భంలోనే దూడ మృతి చెందినట్లు గుర్తించి ఆగమేఘాలపై అదే వాహనంలో అనంతపురంలోని పశు వైద్యశాలకు తరలించారు. దాదాపు గంట పాటు డాక్టర్లు ఆంజనేయులు నాయక్, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, సరిత, వీఏ ఆకాష్ శ్రమించి ఆవు గర్భం నుంచి మృతి చెందిన దూడను వెలికి తీశారు. ఆవుకు ఎలాంటి హానీ కలగలేదని నిర్ధారించుకున్న అనంతరం సంచార పశు ఆరోగ్య వాహనంలోనే ముద్దలాపురానికి తీసుకువచ్చి రైతు ఇంటి వద్ద వదిలి వెళ్లారు. సంచార పశు ఆరోగ్య వాహన వైద్య సేవలపై ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి

ముదిగుబ్బ/నల్లమాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆదేశించారు. మంగళవారం ఆమె ముదిగుబ్బలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, నల్లమాడలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు పరిశీలించారు. ముదిగుబ్బలో విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబుల వినియోగంపై ఆరా తీశారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత పనితీరు సక్రమంగా లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. నల్లమాడ ప్రాథమిక పాఠశాలలో పనులు చేపట్టడంలో జాప్యంపై హెచ్‌ఎం నరసింహులును నిలదీశారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో మాట్లాడి వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

లేపాక్షి: మండలంలోని విభూతిపల్లిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... విభూతిపల్లికి చెందిన సత్యనారాయణ, గంగాదేవి (38) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బెంగళూరుకు వెళ్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని సత్యనారాయణ పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు కొంత డబ్బును గంగాదేవి అప్పుగా ఇచ్చింది. అప్పు తిరిగి చెల్లించాలంటూ గంగాదేవి కొంత కాలంగా లక్ష్మీనారాయణను అడుగుతోంది. ఈ రోజు.. రేపు అంటూ అతను కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో సోమవారం సాయంత్రం లక్ష్మీనారాయణ పొలం వద్ద ఉన్న సమయంలో గంగాదేవి అక్కడికెళ్లి డబ్బు గురించి మాట్లాడింది. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో ఆమె తన చీరతో నీటి గుంత పక్కనే ఉన్న జాలి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి భర్తను బెంగళూరు నుంచి పిలిపించి విచారణ చేశారు. తన భార్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సత్యనారాయణ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్య పరిస్థితులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళకుంట గ్రామానికి చెందిన తిరుమలయ్య, సుశీలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు వీరేందర్ (22) తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న వీరేందర్.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు వేరుశనగ పొలానికి వెళ్లాడు. ఉదయం 10 గంటలకు తల్లిదండ్రులు పొలానికి వెళ్లారు. అప్పటికే పొలంలోని పనస చెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న వీరేందర్‌ను చూసి బోరున విలపించారు. కళ్యాణదుర్గం రూరల్ దర్యాప్తు చేపట్టారు.

నీటి కుంటలో వృద్ధుడి మృతదేహం

చిలమత్తూరు: మండలంలోని హుస్సేన్‌పురం వద్ద క్వారీ సమీపంలో నీటి కుంటలో వెంకటాపురం గ్రామానికి చెందిన ఆదెప్ప(80) మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం ఆదెప్ప బహిర్భూమి కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. మంగళవారం నీటికుంటలో మృతదేహమై తేలియాడుతుండడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారన్నారు. మృతుడి కుమారుడు ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సోలార్ పార్క్‌ను పరిశీలించిన జీ–20 ప్రతినిధులు



విదేశీ ప్రతినిధులతో కేఎస్‌పీడీసీఎల్ అధికారులు

పావగడ: ఆసియా ఖండంలోనే 13 వేల ఎకరాల భూమిలో 2,050 మెగావాట్స్ సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తిరుమణి సోలార్ పార్క్‌ను జీ–20 దేశాలకు చెందిన 38 మంది ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. భారీ బందోబస్తు మధ్య రెండు బస్సుల్లో ప్రతినిధులు మధ్యాహ్నం 12 గంటలకు తిరుమణి సోలార్ పార్క్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వీరగాసే సంప్రదాయ నృత్యాలతో అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. వీరగాసే నృత్యానికి సమ్మోహితుడైన చైనా ప్రతినిధి తాను కూడా నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. నూతన సోలార్ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు స్థానిక కేఎస్‌పీడీసీఎల్ (కర్ణాటక సోలార్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అధికారులు, సోలార్ కంపెనీల నిర్వాహకులు హాజరయ్యారు. సోలార్ పార్క్ సీఈఓ అమర్‌నాథ్ మాట్లాడుతూ... సోలార్ పార్క్ నిర్మాణం, సౌర విద్యుత్ ప్రయోజనాలను వివరించారు. అనంతరం విదేశీ ప్రతినిధులు సోలార్ పార్క్ బ్లాక్ 40 లోని పవర్ గ్రిడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వైఎస్ పాటిల్, ఎస్పీ రాహుల్‌కుమార్, ఏసీ రిషి ఆనంద్, తహసీల్దార్ వరదరాజు తదితర తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీ–20 డెలిగేట్స్ రాకతో లేపాక్షి కళకళ..

లేపాక్షి: జీ–20 డెలిగేట్స్ బృందం రాకతో మంగళవారం లేపాక్షి కళకళలాడింది. దుర్గాదేవి, రఘునాథ్ స్వామి, వీరభద్రస్వామి, పాపనాశేశ్వరస్వామి, ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కర్ణాటక, కేరళ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో విదేశీ ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.